క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ

చింతకాని: మండలంలో ఉన్నటువంటి 49 పోలింగ్ కేంద్రాలను ఖమ్మం ఆర్డీఓ రవీంద్ర నాథ్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలతో పాటుగా దివ్యాంగుల కోసం వినియోగించే ర్యాంప్‌లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓ లకు తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంగీలాల్, గిర్దావర్ ఉషా, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మధిర: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యగా ఉంటారని మడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ వలి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పౌష్టికాహారం, ఆరోగ్యం విషయాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరివార్ కార్యకర్త జ్యోతి పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులందరూ హ్యాండ్ వాష్‌ను మరవొద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, బాబూరావు, కిషోర్, రామిరెడ్డి, కృష్ణయ్య, రాణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల తెలంగాణ ముస్లిం మైనార్టీ బాలుర పాఠశాలలో పీజీటీ ఫిజికల్ సైన్స్ పోస్టు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సైదులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి పీజీలో భౌతిక శాస్త్రం, లేదా రసాయన శాస్త్రం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఫిజికల్ సైన్స్ మెదడాల జీతో బీఈడీ పూర్తి చేయడంతో పాటు 3 ఏళ్ల బోధన అనుభవం ఉండాలన్నారు. అంతే కాకుండా ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ పోస్టుకు కూడా అర్హులైన అభ్యర్థుల నుంచి దరకాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. 18 నుంచి 34 ఏళ్ల లోపు వారు పదో తరగతి ఉత్తీర్ణత సాధించడంతో పాటు వృత్తిలో కనీసం 5 ఏళ్ల అనుభవం ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 73311 70861 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టీబీ వ్యాధిపై అవగాహన

తల్లాడ: తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రత్న మనోహర్ మాట్లాడుతూ.. ప్రతి నెలా 24న టీబీ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యాధిసోకిన వారికి ఉచితంగా మందులతో పాటు ఎంపీ బండి పార్థసారధిరెడ్డి అందించిన ఫుడ్ బాస్కెట్ కిట్లు అందిచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ పెద్ద పుల్లయ్య, అమృత రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

తల్లాడ: విద్యావ్యవస్థలో సంక్షోభాన్ని పరిష్కరించాలని, బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కల్లూరి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం తల్లాడలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పర్మానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 'మన ఊరు – మన బడి'తో రూపురేకలు మారినప్పటికీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. ఇంత వరకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రదాన కార్యదర్శి బొల్లిపోగు సుధాకర్, ఉపాధ్యక్షుడు జి.పాపయ్య, జి.ప్రగతికుమారి, కోశాధికారి సమ్మయ్య, బి.కృష్ణార్జున్‌రావు, ఎంపీదాస్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం

బోనకల్: పాలక ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణపు వెంకటేశ్వరావు విమర్శించారు. మండలంలోని సీఐటీయూ కార్యాలయంలో బోయినపల్లి వీరబాబు అధ్యక్షతన బిల్డింగ్ వర్కర్స్ మండల స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేకమంది అసంఘటిత రంగ కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో రైతుసంఘం నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఖాదర్‌బాబా, తాళ్లూరి ఏసు, రమేష్, నరేష్, శివనాగేంద్ర పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కృష్ణయ్య

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొడ్డా కృష్ణయ్య, సెక్రటరీగా పెనుగొండ రమేష్, కోశాధికారిగా గుండు శ్రీనివాసరావులను డిస్ట్రిక్ గవర్నర్ తీగల మోహన్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు వై.ప్రభాకర్‌రెడ్డి, కె.మురళీకృష్ణ, గంధ్ర సోమిరెడ్డి, కొండపల్లి రమేష్‌రెడ్డి, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, లింగారెడ్డి, జన్మోహన్‌రావు, జంగా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదవి.. పంతం

జమలాపురం ఆలయ చైర్మన్ నియామకంపై రాజకీయ రగడ

- ఆలయ ధర్మకర్తలకు చైర్మన్ పదవి ఇవ్వొద్దని విజ్ఞప్తులు
- అయినా వారికే మొగ్గుచూపిన అధికార పార్టీ నేతలు
- అధిష్టానం సహకారం లేదని మూడు పదవుల రాజీనామాకు సిద్ధపడిన సొసైటీ చైర్మన్
- సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- దృష్టి సారించాలంటున్న అధికార పార్టీ శ్రేణులు

తెలంగాణ తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ పాలక మండలి చైర్మన్ నియామకం అధికార పార్టీలోనే రాజకీయ దుమారం రేపుతోంది. ఆలయ చైర్మన్ నియామకంలో స్థానిక అధికార పార్టీ నేతకు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులతో రాజకీయ రగడ మరింతగా ముదిరింది. ఆలయ ధర్మకర్తలకే పార్టీ అధిష్టానం సహకరిస్తుందనే ఆలోచనతో స్థానిక అధికార పార్టీ నేత తనతో పాటు తమ ఇంట్లోని మరో రెండు పదవులు సైతం పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుంది.



జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీవారి ఆలయంలో పని చేసే అర్చకులు, ధర్మకర్తలుగా చిరకాలంగా ఉప్పల వంశస్తులే ఉన్నారు. ఆలయ ధర్మకర్తలనే పాలకమండలి చైర్మన్‌లుగా నియమించడం దేవాదాయ శాఖ ఆనవాయితీగా వస్తోంది. పాలకమండలి సభ్యులుగా మాత్రం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అన్ని వర్గాల వారిని నియమిస్తూ వస్తోంది. ఈక్రమంలో ఆలయ చైర్మన్‌గా ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తిని నియమించింది. అయితే ఆలయ పాలక మండలి చైర్మన్ నియామకంపై తలెత్తిన వివాదాన్ని ఈఓ కె.జగన్మోహన్‌రావు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకురాగా ఫలితం లేకపోవడంతో ఆలస్యం చేయకుండా ఆలయ చైర్మన్ పదవికి ఈ నెల 17న ఈఓ ప్రమాణస్వీకారం చేయించారు.

సంప్రదాయం కొనసాగించొద్దని విజ్ఞప్తులు..

కాగా, ఆలయ ధర్మకర్తలకు పాలక మండలి చైర్మన్‌గా కొనసాగే హక్కు లేదని, వారికే ఇవ్వాలనే సంప్రదాయాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక సర్పంచ్ ముల్పూరి స్వప్న, స్థానిక అధికార పార్టీ నేత, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావుతో పాటు పలువురు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేశారు. ఆలయ నిర్వహణ తీరంతా అర్చకుల చేతిలో ఇష్టారీతిగా కొనసాగుతూ.. అభివృద్ధి కుంటుపడుతుందని, దాతలిచ్చిన విరాళాలు దుర్వినియోగమవుతూ.. స్వాహా అవుతున్నాయని దేవాదాయ శాఖ కమిషనర్, దేవాదాయశాఖ మంత్రి, జిల్లా మంత్రి, జెడ్పీ చైర్మన్‌లకు ఫిర్యాదు చేశారు.

భట్టి గెలుపుకు సహకరించాడని..

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గెలుపులో ఈ అధికార పార్టీ నేత కీలకంగా వ్యవహరించాడనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ సామాజికంగా బలమైన వర్గపు నేతగా ముల్పూరి శ్రీనివాసరావు కుటుంబం ఉండడంతో ఆ కుటుంబానికే అధికార పార్టీ ప్రాధాన్యత ఇచ్చి అతనితో పాటు ఆ ఇంట్లోని మరో ఇద్దరికి స్థానిక సంస్థల పదవులను కట్టబెట్టింది. మొత్తం మూడు పదవులు ఆ ఇంటినే వరించడానికి అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడా సహకరించాయనేది సర్వత్రా చర్చనీయాంశమైంది.

అధిష్టానంపై ఆగ్రహం..

కాగా, ఇటీవల ఆలయ కమిటీ పాలకమండలి చైర్మన్, సభ్యుల నియామకాలకు గాను చైర్మన్‌గా శ్రీనివాసరావు తన పేరుతో పాటు పాలక మండలి సభ్యుల పోస్టులకు గాను పలువురు అధికార పార్టీ వ్యక్తుల పేర్లను మంత్రి, జెడ్పీ చైర్మన్‌ల సహకారంతో దేవాదాయశాఖకు పంపించారు. ఊహించని రీతిలో మళ్ళీ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి పేరును దేవాదాయ శాఖ ఖరారు చేయడంతో శ్రీనివాసరావు అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో అధికార పార్టీ తమకు సహకరించడంలేదని తాను పార్టీకి సరైన సేవలు అందించలేనని భావించి రాజీనామా పత్రాన్ని జెడ్పీ చైర్మన్‌కు పంపినట్లు సమాచారం. ఈ విషయాన్ని కొందరు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే పాలక మండలి సభ్యుల నియామకాలకు ఎటువంటి ఉత్తర్వులు అందలేదు.

కాంగ్రెస్‌కు కలిసొచ్చే అవకాశం..?

జమలాపురం ఆలయ పాలకమండలి చైర్మన్ నియామక వివాదాన్ని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఉంటూ నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. తమకు కలిసొచ్చే అవకాశాలున్నట్లుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం చెప్పుకుంటున్నారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లుగా వైరల్ అవుతున్న విషయమై ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావును సాక్షి సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

నిబంధనల మేరకే ప్రమాణ స్వీకారం..



దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఆలయ పాలకమండలి చైర్మన్‌గా ఉప్పల శ్రీరామచంద్రమూర్తితో ప్రమాణ స్వీకారం చేయించాం. చిరకాలంగా ఆలయ ధర్మకర్తలకే చైర్మన్ పదవి ఇవ్వాలని దేవాదాయ శాక జీఓలున్నాయి. రాజకీయపరమైన విషయాలతో మాకు సంబంధం లేదు. పాలకమండలి సభ్యుల నియామకాలకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. నిబంధనల మేరకు మా విధులు నిర్వర్తించాం.

– జగన్మోహన్‌రావు, జమలాపురం ఆలయ ఈఓ

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు

తల్లాడ: కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జూన్ 2న చేరనున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తల్లాడలో గోపిశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరనున్నారని ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో రావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బ్రహ్మయ్య, రఘుపతిరెడ్డి, సుధాకర్, లక్ష్మీరెడ్డి, రమేష్, రవి, వెంకటనారాయణ, నరసింహారావు, కృష్ణయ్య, బ్రహ్మారెడ్డి, లచ్చిరెడ్డి, నాగిరెడ్డి, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

లబ్ధిదారుల యూనిట్ల పరిశీలన

బోనకల్: మండలంలోని బోనకల్, చిరునోముల గ్రామాల్లో బీసీ వృత్తిదారులకు మంజూరైన యూనిట్లను శుక్రవారం ఎంపీడీఓ వేణుమాదవ్ పరిశీలించారు. ఇటీవల మధిరలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి రూ.లక్ష ఇవ్వడం జరిగింది. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి యూనిట్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ శాస్త్రి, కార్యదర్శులు కిరణ్, అర్జున్ తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఐదుగురు పేకాటరాయుళ్లను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,410 లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూ పోటీల్లో 'విజయ' విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జేఎన్‌టీయూ హైదరాబాద్ వారు నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నారు. ఈ మేరకు శుక్రవారం విజయ ఇంజనీరింగ్ కళాశాలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి కవితలు, డిబేట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ చిన్నయ్య, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ బాబా, లిటరరీ కన్వీనర్ సాజీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



గోపికా శరణ్య కృష్ణ

వేంసూరు/కల్లూరు: మండలంలోని భీరపల్లి గ్రామానికి చెందిన వేదుల గోపిక శరణ్య కృష్ణ నవోదయ పరీక్ష ప్రతిభ చూపడంతో యూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యుగేందర్ అభినందించారు. ఈమె 24వ ర్యాంక్ సాధించి పాలేరు నవోదయలో సీటు సాధించింది. అదే విధంగా కల్లూరు బాలాజీ విద్యాలయం నుంచి కల్లూరు మండలానికి చెందిన బి.రుత్విక, ఎ.తనీష్, ఎం.గౌతమ్, ఎం.నాగచైతన్య, బి.శాంసన్, బి.శర్మేందర్ నాయక్, పి.అలెంజో, తల్లాడ మండలానికి చెందిన టి.బేవన్ భార్గవ్, ఎం.ప్రవీణ్ సాత్విక్, పి.పవన్, ఎం.సాత్విక్, ఎస్.ప్రియతమ్, ఎస్.సుదీప్‌లు నవోదయలో సీటు సాధించారు. వీరిని కరెస్పాండెంట్ బాలాజీ, హెచ్‌ఎం నరేంద్రకుమార్, ఎం.స్వరూప, సీహెచ్ కిరణ్‌లు అభినందించారు.

ఉత్తమ విద్యార్థినికి అభినందన

ఎర్రుపాలెం: ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి జన విజ్ఞాన వేదిక ప్రతినిధి ఎం.రామ్ ప్రదీప్‌తో పాటు పలువురు అభినందించారు. మండలంలోని గుంటుపల్లి గోపవరం గ్రామానికి చెందిన మోదుగు సాధన ఇంటర్ మీడియట్‌లో 947 మార్కులు, ఎంసెట్ ఎంట్రన్స్‌లో 3,506 ర్యాంకు సాధించడంతో ఆమెను శుక్రవారం వారు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బోనకల్: ప్రభుత్వం పేదింటి మహిళల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అందిస్తుందని గ్రామ సర్పంచ్ కె.ఉపేందర్ అన్నారు. శుక్రవారం రైతువేదికలో రావినూతల గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాధ, ఉపసర్పంచ్ కొండ, ఆర్‌ఐ లక్ష్మణ్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లిఖార్జున్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత



ఎర్రుపాలెం: విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న జగదీష్ పాల్

కల్లూరు రూరల్/ఎర్రుపాలెం: మండలంలోని చెన్నూరు పంచాయతీలో గల వెంకట రామాపురం పాఠశాల విద్యార్థులకు తోపుడుబండి అధినేత సాధిక్‌అలీ ఆధ్వర్యంలో శుక్రవారం యూనిఫాం, దోమలతెరలు, పుస్తకాలు పంపిణీ చేశారు. అదే విదంగా ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన పలువురు పేద విద్యార్థులకు స్థానిక సుదర్శన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను వితరణగా అందించారు. వీటిని స్థానిక ఎలోహిమ్ చర్చిలో ఫాదర్ జగదీష్ పాల్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధికి అన్నివిధాలుగా చేయూతనిస్తామన్నారు. ఈ కార్యక్రమాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు హరీష్, హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు రజిత, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన ఎమ్మెల్యే సండ్ర



మంత్రి ఎర్రబెల్లికి పల్లెప్రగతి నివేదికను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హైదరాబాద్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును శుక్రవారం తన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖలో మిగిలిన పనులను పూర్తి చేయాలని కోరారు. అనతరం సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో పల్లెప్రగతి నివేదికలను ఆయనకు అందించారు.

ఈ సమస్యలు పట్టదా..?



ప్రమాదభరితంగా ఉన్న ఆర్వోబీ రెయిలింగ్

బోనకల్: అధికారులకు మా సమస్యలు పట్టవా.. అని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని ఆర్వోబీపై రెయిలింగ్ పూర్తిగా దెబ్బతిని నువ్వులు బయటపడ్డాయి. బ్రిడ్జి కింద పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. ఈ విషయమై నెలరోజుల క్రితం ఉన్నతాధికారులకు తెలిపిన ఉపయోగం లేకుండా పోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో తరచూ.. ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఇకనైనా అధికారులు పట్టించుకోని బ్రిడ్జిపై మరమ్మతులు చేయించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కూలీలకు మెడికల్ కిట్లు పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని రుద్రాక్షపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు శుక్రవారం మెడికల్ కిట్లు, హెల్త్‌కార్డులు, మజ్జిగ ప్యాకెట్లను కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు మట్టా రాగమయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మీ అందరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఈ గ్రామంలో ఒక్కరికి కూడా డబుల్ ఇళ్లు, దళిత బంధు పథకం రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో భూపతిరెడ్డి, భరత్ కుమార్, గోపినాథ్, కృష్ణ, మధు, పాషా, కృష్ణ, సూరి, మహేంద్ర, శ్రీను, హరికృష్ణ, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

పదును మీదే విత్తనాలు వేసుకోవాలి

ఏన్కూరు: రైతులు పదును మీదే విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. మండలంలోని నాచారం, తూతకలింగన్నపేట, గార్లఒడ్డు, బురదరాఘవాపురం, ఆరికాయలపాడు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వర్షాలు పడిన తరువాతనే విత్తనాలు వేసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మధిర: దళితులపై వివక్ష చూపుతున్న దెందుకూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణదాసుపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. పాఠశాలకు హెచ్‌ఎం వస్తే మేము రామని విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై ఎంఈఓ ప్రభాకర్ స్పందిస్తూ.. ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి తొలగిస్తామనడంతో వారు ఆందోళన విరమించారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి..

దళిత విద్యార్థులను చిన్నచూపు చూస్తున్న హెచ్‌ఎం నారాయణదాసును వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరాచారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కూరపాటి సునీల్ మాదిగ మాట్లాడుతూ.. గతంలో పిల్లలతో అసభ్యకరంగా మాట్లాడడటమే కాకుండా విచక్షణ రహితంగా కొట్టేవాడని, ఈ విషయమై ఎంఈఓ సమక్షంలో క్షమాపన తెలిపడం జరిగిందన్నారు. అలాంటి అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు అంజయ్య మాదిగ, కూరపాటి ప్రభాకర్ మాదిగ, అశోక్ మాదిగ తదితరులు ఉన్నారు.

విద్యుత్ అదాలత్‌తో సమస్యలు పరిష్కారం



ఏడీఈ అనురాధకి వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారులు

మధిర: విద్యుత్ అదాలత్ కార్యక్రమం ద్వారా పలు సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యుత్ శాఖ మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ అన్నారు. విద్యుత్ శాఖ దత్తత గ్రామాలైన మండలంలోని ఖమ్మంపాడు, అల్లీనగరం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమాలు నిర్వహించారు. వినియోగదారులు విద్యుత్ పరమైన సమస్యలను తెలియపరిచి పరిష్కారం పొందారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు తమ కుల ధ్రువీకరణ పత్రాలను విద్యుత్ కనెక్షన్‌కి అనుసంధానం చేయడానికి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో మధిర రూరల్ విద్యుత్ ఏఈ నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది శివాని, చెరుపల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్ రమణకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బోనకల్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా పనిచేస్తున్న అర్హత కల్గిన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఐజేయూ నాయకుడు వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి సురభి వెంకన్నలు తెలిపారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ సీహెచ్ రమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ హామీ మేరకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇళ్ల స్థలాలను కేటాయించడం జరిగిందని.. అలాగే మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడంతో పాటు ఎంపీ నామా నాగేశ్వరరావు, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ లకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మధిర డివిజన్ ప్రధాన కార్యదర్శి తమ్మారపు బ్రహ్మం, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాసరావు, డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ సభ్యులు శ్రీనివాసరావు, పవన్ పాల్గొన్నారు.

నియామకం..



ఛాయాదేవి

కారేపల్లి: సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని గిద్దెవారిగూడెం గ్రామానికి చెందిన వీసాల ఛాయాదేవిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునితారావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల లు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఛాయాదేవి విలేకరులతో మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, ఈ పదివికి ఎంపిక చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రప్రకాశ్, సురేందర్ మనియార్, వెంకటేశ్వర్లు, జగన్నాథం, జగన్, వెంకటేశ్వర్లు, పద్మ, ఎంపీటీసీ పార్వతి, భద్రునాయక్, శ్రీనివాసరావు, ఓంప్రకాశ్ బూబ్, నరసింహారావులు హర్షం వ్యక్తం చేశారు.

బోనకల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై సాయికుమార్

బోనకల్: బోనకల్ ఎస్సైగా బి.సాయికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై తేజావత్ కవిత బదిలీపై మధిర వెళ్లారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

నిరుపేదలకు నవ చైతన్య విశిష్ట సేవలు



నిత్యావసర సరుకులు అందిస్తున్న సీఐ కరుణాకర్

సత్తుపల్లి: నవచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ నిరుపేదలకు విశిష్ట సేవలందిస్తుందని సీఐ టి.కరుణాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 10వ వార్డు వెంగళరావునగర్‌లో 2వ విడత నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె నర్సింహారెడ్డి, తోట కిరణ్, డైరెక్టర్లు మాదిరాజు పుల్లారావు, గాదె నాగు, బొల్లిపోగు సురేష్, రాగం శ్రీను, పాలకొల్లు శ్రీనివాసరావు, ఇనపనూరి నవీన్, గంధం వీరాస్వామి, దాది సందీప్, మోహన్, పాషా, నవనీత్, దయాకర్, సుమాన్, ఏసు, మారేష్, మనోహర్, నీలాద్రి పాల్గొన్నారు.

బీజేపీకి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే

చింతకాని: బీజేపీకి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని నర్సింహాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, గోపాలరావు, వెంకటనర్సయ్య, జానికి రాములు, కృష్ణమూర్తి, రవి, ఉపేందర్, రమణ, యజ్ఞనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: సీఈఐఆర్ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు. మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందన శివ ఇటీవల సెల్‌ఫోన్ పొగుట్టుకున్నాడు. అతని ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను గుర్తించి రికవరీ చేసి శుక్రవారం ఆ వ్యక్తికి అందిచారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సందడిగా సాగుతోందిలా..



వేంసూరు: భీమవరం సమీపంలో పొలంలో నాటు వేస్తున్న కూలీలు

వాతావరణం చల్లబడంతో సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో రైతన్నలు పొలం బాట పట్టారు. దుక్కులు దున్నటం, పత్తి కట్టి కాల్చడం, నారు పోయడం, పొడి కరివేద చల్లడం వంటి పనులు మొదలుపెట్టడంతో పొలాల్లో సాగు సందడి నెలకొంది. పలు గ్రామాల్లో రైతులు ముందుగా నారుపోయడంతో.. నాట్లు వేయిస్తున్నారు. పంట చేలల్లో పత్తి విత్తనాలు విత్తడంతో పాటు మిర్చి నారు కూడా పోస్తున్నారు. ఈ సందర్భంగా విత్తన దుకాణాలు రైతులతో కిటకిటలాడాయి. మరో మూడు రోజుల పాటు వర్షపు సూచనలు ఉన్న నేపథ్యంలో.. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

వేంసూరు/వైరారూరల్/ఎర్రుపాలెం